



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ నరసింహ కిశోర్



ముంచుకొస్తోంది : కోనసీమ జిల్లా ఓడలరేవులో భారీగా కోతకు గురైన సముద్రతీరం



ముక్కలు..చెక్కలు : ఉప్పాడ వద్ద రోడ్డు కోత

ముప్పు ముంచుకొస్తోంది.. సముద్రతీరం భారీగా కోతకు గురవుతోంది. అలజడి రేపు తోంది..అటు కాకినాడ.. ఇటు కోనసీమ జిల్లాల్లో వేలాది ఎకరాల విలువైన భూములు సముద్రగర్భంలో కలిసిపోతు న్నాయి. రహదారులు, సరుగుడు తోటలు, మడ అడవులు కళ్లె దుటే కడలిలో కలిసిపోతూ ప్రజ లను ఆందోళనకు గురిచేస్తున్నాయి. సముద్ర తీరం వెంబడి అక్రమంగా ఇసుక తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.



కల్లోల..కడలి!

- కడలి కోపాగ్నికి కరుగుతున్న తీరం
- ఉప్పాడలో కోత నివారణకు కసరత్తు
- సీఎం ఆదేశాలతో కేంద్రానికి కలెక్టర్ లేఖ
- రూ.320 కోట్ల నిధులు కోరిన వైనం
- కేంద్రం నుంచి సానుకూల స్పందన
- శాస్త్రవేత్తలతో ప్రత్యేక అధ్యయనం
- కోనసీమలో మునుగుతున్న ఊళ్లు

(కాకినాడ/ అమలాపురం, ఆంధ్రజ్యోతి)
ఏళ్ల తరబడి ఉప్పాడను వేధిస్తోన్న సముద్రపు కోతకు శాశ్వత పరిష్కారం సాధించే దిశగా ప్రభుత్వం అడు గులు ముమ్మరం చేసింది. ఐదేళ్లుగా కోత తీవ్రతతో నష్టం పెరిగినా అప్పటి వైసీపీ సర్కారు పట్టించుకోలేదు. ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉప్పా డను సముద్రపు కోత నుంచి కాపాడేందుకు వడివడిగా అడుగులు పడుతు న్నాయి. ఇటీవల కలెక్టర్ల సదస్సులో సముద్రపు కోతపై జరిగిన చర్చలో కోత నివారణకు అవసరమైన నిధులను కేంద్రం నుంచి రాబట్టేలా పర్యవేక్షిం చాలని కలెక్టర్ షాన్ మోహన్‌ను సీఎం ఆదేశించారు. దీంతో ఇటీవల కలెక్టర్ కేంద్రానికి లేఖ రాశారు. రూ.320 కోట్లతో 12 కిలోమీటర్ల మేర కోత నివారణకు ప్రణా ళిక సిద్ధం చేశామని వివరించారు. సీఎం ఆదే శాలతో ఈ ప్రతిపా దనపై జాతీయ విపత్తుల నిర్వహణ సం స్థతో సంప్రదింపులు ఆరం భించింది. నష్ట నివారణ నిధుల విడుదలకు దాదా పు సమ్మతించింది.ఈ తర హా ప్రతిపాదనలు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చినట్టు వివరించింది. ఉ ప్పాడ కోత తీవ్రత దృష్ట్యా త్వరలో నిధులు విడుదలకు మార్గం సుగమం అ వుతుందని అధికారులు భావిస్తున్నారు.

కోతకు అడ్డుకట్ట ఇలా

డిప్యూటీ సీఎం పవన్ జోక్యంతో కోతను అధ్యయనం చేయడానికి నేషనల్ కోస్టల్ రీసెర్చ్ సెంటర్ (ఎన్‌సీఆర్‌సీ) శాస్త్రవేత్తలు వచ్చి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఉప్పాడ వద్ద దక్షిణం, ఉత్తర దిశల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలో డ్రాఫ్ట్ రూపొందించారు. ప్రధానంగా ఉప్పాడ వద్ద సముద్రం అలల తీవ్రత చాలా అధికంగా ఉన్నట్టు తేల్చారు.దానిని తగ్గించ గలిగితే కోత బాగా నెమ్మదిస్తుందని అంచనా వేశారు. ఉప్పాడ వద్ద తీరం నుంచి 170 మీటర్ల లోపు సముద్రంలో అత్యంత బలంగా కాంక్రీట్‌తో నిలువునా గోడ నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి టెట్రాపాడ్‌లు కలపనున్నారు.టెట్రాపాడ్‌లు మూడు కాళ్ల ఆకారంలో కాంక్రీట్ దిమ్మల్లా చాలా బలంగా ఉంటాయి.వీటిని కాంక్రీట్ గోడపై అమర్చుతారు. ఆపైన మళ్లీ భారీ రాళ్లు పేర్చుతారు. దీనివల్ల ఉప్పాడ వైపు అలల తీవ్రత దాదాపుగా తగ్గి కోత నెమ్మది స్తుంది. ఉప్పాడకు దక్షిణం వైపు కాకినాడ నుంచి వచ్చే దారిలో మలుపు వద్ద సముద్రం పూర్తిగా ముందుకు వచ్చేసింది.ఈ నేపథ్యంలో ఇక్కడ కొత్త బీచ్ సృష్టించాలని ప్రతిపాదించారు. శాస్త్రవేత్తలు పరిష్కారం కనుగొన్నారు. ఉప్పాడకు సమీపంలో కాకినాడ డీప్‌వాటర్ పోర్టు ఉంది. నేరుగా భారీ నౌకలు ఈ పోర్టుకు వస్తాయి.నౌకలు వచ్చే మార్గంలో ఏటా ఇసుక డ్రెడ్జింగ్ చేసి నౌకా మార్గానికి ఇబ్బంది లేకుండా చేస్తారు. డ్రెడ్జింగ్ చేసిన సమయంలో వచ్చే ఇసుకను ఉప్పాడ దక్షిణం వైపు పోసి కొత్త బీచ్ సృష్టించాలని తేల్చారు. ఏడాదికి 50 లక్షల క్యూబిక్ మీటర్ల చొప్పున, రెండేళ్లకు కోటి క్యూబిక్ మీటర్ల ఇసుకను తెచ్చి ఇక్కడ డంప్ చేయాలని నిర్ణయించారు.ఇలా 12 కిలోమీటర్ల మేర కోత నివారణ చర్యలు చేపట్టడానికి రూ.320 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

20 ఏళ్లుగా ముందుకు..

కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద సముద్రం 20 ఏళ్లుగా భారీగా ముందుకు వచ్చేసింది. తుఫాన్లు, అల్పపీడనం సమయాల్లో తీరం అల్లకల్లోలంగా మారుతోంది. కోత వల్ల ఏకంగా 1,360 ఎకరాలు, రెండు ఆలయాలు, 150 వరకు ఇళ్లు సముద్ర గర్భంలో కలిసిపోయాయి.అధికారంలోకి వస్తే కోత నివారణకు శాశ్వత చర్యలు చేపడ తామని ప్రస్తుత ప్రభుత్వం హామీ ఇచ్చింది.దీనికి తగ్గట్లుగా అడుగులు వేస్తుంది.

కోనసీమకూ.. గుండెకోత

కోనసీమలో సముద్రతీరం తీవ్రంగా కోతకు గురవుతోంది. వందల ఎకరాల భూములు కడలిలో కలిసిపోతున్నాయి. కోనసీమ జిల్లా 8 మండలాల పరిధిలో 48 కి.మీ. మేర తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఒక వైపు ఇసుక మాఫియా ప్రతినిధులు తీరాన్ని తవ్వేస్తుంటే మరో వైపు సముద్రం ముందుకు దూసుకొస్తూ ఊళ్లను ముంచెత్తుతోంది. భైరవపాలెంలోని సముద్రతీర ప్రాంతం నుంచి బ్రహ్మసమేధ్యం, చిర్రయానాం, ఎస్.యానాం, వాసాలతిప్ప, కొమరిగిరిపట్నం,ఓడలరేవు, కేశనపల్లి, కరవాక, చింతలమోరి, అంతర్వేది తీరం వరకు సముద్రం భారీగా కోతకు గురవుతోంది. భవిష్యత్‌లో ఆందోళనకరమైన పరిణామాలకు కారణంగా నిపుణులు భావిస్తున్నారు. ఓడలరేవు తీరప్రాంతంలో వేలాది కోట్ల విలువైన చమురు సంపదను తరలించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఓఎన్జీసీ ప్లాంటుకు సంబంధించి భారీ నిర్మాణాలకు చేరువగా సము ద్రం ముందుకొచ్చింది. ఇటీవల తీరం అల్లకల్లోలం కావడంతో గతంలో ఓ కాంట్రాక్టు సంస్థ నిర్మించిన రక్షణ గోడ ఇప్పుడు ఛిద్రమై ప్లాంటు గోడ కూడా కోతకు గురయ్యే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. దీంతో ఓఎన్జీసీ అధికారులు ప్రత్యేక కార్యాచరణకు రంగం సిద్ధం చేస్తున్నారు. రూ.110 కోట్ల అంచనా వ్యయంతో సముద్రం వెంబడి పటిష్టమైన, అత్యాధునికమైన టెక్నాలజీతో కూడిన గోడను నిర్మించుకునేందుకు త్వరలోనే ఆ సంస్థ అధికారులు టెండర్లు పిలుస్తారని ఇక్కడ ప్రచారం జరుగుతోంది. కాగా ఓడలరేవు సముద్ర బీచ్ రిసార్ట్సకు కూడా రాగల రోజుల్లో ముప్పు పొంచి ఉందని భావిస్తున్నారు.

పీజీఆర్ఎస్‌కు 193 అర్జీలు



జేసీకి సమస్యను విన్నవిస్తున్న యువతి

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రీ ఓపెన్ అయిన అర్జీల విషయంలో మరింత జవాబుదారీతనం కలిగి ఉండాలని జేసీ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మా ట్లాడారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.జిల్లాలో 964 అర్జీలు రీ ఓపెన్ కాగా ఇంకా 69 పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. రీ ఓపెన చేసిన ప్రతి అర్జీదారుడిని వ్యక్తిగతంగా కలిసి పరిష్కారం వివరాలు తెలియచేయాలన్నారు. అనంతరం 199 అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.కార్యక్రమంలో డీఆర్వో టి.సీతారామమూర్తి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంఆర్ఆర్.ప్రేమ్‌కుమార్,డీఎల్‌డీవోలు పి.వీణాదేవి, ఏ.స్లీవారెడ్డి, డీపీవో శాంతమణి పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 46 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఎస్పీ నరసింహ కిశోర్ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి పలు సమస్యలపై వెంటనే ఫోన్ ద్వారా ఆయా పోలీస్ స్టేషన్ల బాధ్యులకు సూచనలు చేశారు. చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల నుంచి 46 అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం.మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు,ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

తూర్పున.. హై బీపీ!



ఎన్‌సీడీ సర్వేలో రోగాలు

- జిల్లాలో బీపీ కేసులు 88784
- డయాబెటిస్ కేసులు 57790
- రాష్ట్రంలో నాలుగో స్థానం
- గుండె వ్యాధిగ్రస్తులు అధికమే
- ప్రబలుతున్న అంటువ్యాధులు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)
ప్రభుత్వం ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో ఓ అడుగు ముందుకు వేసింది. ప్రజలు ఎందుకు రోగాల బారిన పడుతున్నారు. ఎవరు ఏ కారణాల వల్ల ఇబ్బందులు పడుతున్నారనే హేతువును తేల్చింది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న వ్యాధుల స్క్రీనింగ్‌లో భాగంగా జిల్లాలో కూడా గతేడాది నుంచి సర్వే చేస్తున్నారు. జిల్లాలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్) 2,3 సర్వే జరిగింది. అందులో అనేక వ్యాధులు బయటపడ్డాయి. ఎక్కువ మంది గుండె, కిడ్నీ, శ్వాస సంబంధిత వ్యాధులు, డయాబెటిస్, క్యాన్సర్, బీపీ వంటి సమస్యలతో అధికంగా ఇబ్బంది పడుతున్నట్టు తేలింది. సర్వేలో సుమారు 10 రకాల వ్యాధుల గురించి ఆరా తీశారు. 18 ఏళ్ల వయసు తర్వాత మహిళలు ఎక్కువ మంది హైపర్ టెన్షన్‌కు గురవుతున్నట్టు తెలిసింది. డయాబెటీస్ మగవారిలో ఎక్కువగా కనిపిస్తోంది. వర్షాకాలంలో వ్యాపించే చికున్ గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు జిల్లాలో అధికంగా ఉన్నట్టు చెబుతున్నారు. జిల్లాలో ఎన్‌సీడీ -2,3 సర్వేల్లో తేలిన అంశాల వివరాలిలా ఉన్నాయి. 88,784 మందికి హైపర్ టెన్షన్ ఉంది. డయాబెటీస్ (చక్కెర వ్యాధి)తో 57,790 మంది బాధపడుతున్నారు. రాష్ట్రంలో డయాబెటీస్ విషయంలో జిల్లా 4వ స్థానంలో ఉంది. హైపర్ టెన్షన్, డయాబెటీస్ ఉన్నవారి సంఖ్య 1,07,482గా ఉంది. ఇక మాయమైపోయిందనుకున్న పొంగు, ఆట్లమ్మ (చికున్‌ఫాక్స్) వంటి అంటువ్యాధులు ఇటీవల ఎక్కువగా కనిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలతో పాటు, ఉమ్మడి జిల్లాలో కూడా కేసులు నమోదు కావడం గమనార్హం. సర్వేలో తేలిన వ్యాధులకు చాలా మంది ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా చికిత్స పొందున్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో గుండె వ్యాధులకు సంబంధించి 8,891 మంది చికిత్స పొందారు.క్యాన్సర్‌కు సంబంధించి 5,106 మంది చికిత్స పొందారు. లివర్ సంబంధిత వ్యాధుల విషయంలో 1,084మంది చికిత్స పొందారు. దీర్ఘకాలిక, శ్వాసకోశ వ్యాధులకు 1015 మంది చికిత్స తీసుకున్నారు. న్యూరాజికల్ ఇష్యూస్‌కు సంబంధించి 4,027 మంది చికిత్స పొందారు.క్రానిక్ కిడ్నీ వ్యాధులకు సంబంధించిన 4993 మంది చికిత్స పొందారు. దీర్ఘకాలిక రోగాలకు ఆహారపు అలవాట్లు, ప్రజల జీవన విధానంలో మార్పు వంటి కారణాలే ఎక్కు వగా కనిపిస్తున్నాయి.

సెమీ మెకనైజ్డ్ బోట్లతో ఇసుక తీత

త్వరలో 10 ర్యాంపుల్లో అమలు - కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి) : త్వరలో 10 గోదావరి ఇసుక ర్యాంపుల్లో సెమీ మెకనైజ్డ్ బోట్లతో ఇసుక తవ్వకాలు జరపనున్నామని..దీని ద్వారా 57,82,950 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ మీటింగ్‌లో మాట్లాడారు. సెమీ మెకనైజ్డ్ ర్యాంపుల్లో కాటవరం , సింగవరం, కుమారదేవం, తాడిపూడి, పెండ్యాల ర్యాంపులను ఇతర జిల్లాలైన పశ్చిమ గోదావరి, కాకినాడ, విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు జిల్లాలకు కేటాయించినట్టు చెప్పారు.వీటిని ఆయా జిల్లాలో డీఎల్ఎస్‌సీ పర్యవేక్షణ ఉండేటట్టు నిర్ణయించారు. సెమీ మెకనైజ్డ్ ర్యాంపులైన ప్రక్కిలంక, చిడిపి, అరికిరేవుల, మునికూడలి, పురుషోత్తపల్లి నుంచి జిల్లా అవసరాలకు ఇసుకను వినియోగించవచ్చన్నారు. రానున్న వానాకాలం దృష్టిలో పెట్టుకుని 18 లక్షల మె ట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ యార్డుల్లో అందు బాటులోకి తేనున్నట్టు చెప్పారు.దీనిని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు వినియోగించుకోవచ్చన్నారు. జిల్లా మైన్స్ ఏడీ డి. ఫణి భూషణ్‌రెడ్డి మాట్లాడుతూ 2024- 25 ఆర్థిక సంవత్సరానికి రూ.380.3 కోట్ల సీనరేజీ వసూలు లక్ష్యంకాగా రూ.390 కోట్లు వసూలు చేసి 102.55 శాతం సాధించినట్టు చెప్పారు. సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, అదనపు ఎస్పీ మురళీకృష్ణ,ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బీవీ గిరి, జిల్లా భూగర్భజల అధికారి వై.శ్రీనివాస్, ఆర్టీవో సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్‌గా పద్మ



కొవ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తూర్పు గోదావరి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిగా డా.ఎం.పద్మ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా పనిచేసిన డా.ఎన్.పద్మశ్రీరాణి పదోన్నతిపై డీసీహెచ్ఎస్‌గా విజయనగరం వెళ్లారు.ఆమె స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నుంచి పద్మ పదోన్నతిపై డీసీహెచ్ఎస్‌గా సోమవారం కొవ్వూరులో బాధ్యతలు స్వీకరించారు.

డెలివరీ బాయ్స్‌కి ఈ శ్రమ్ గుర్తింపు కార్డులు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): డెలివరీ రంగంలో పని చేసే ఉద్యోగులు/కార్మికులు ఉచితంగా పేరు నమోదు చేసుకొని కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసే గుర్తింపు కార్డు పొందవచ్చని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. అమెజాన్, జొమాటో, స్విగ్గీ, ఊబర్, ర్యాపిడో, ఓలా, బిగ్ బాస్కెట్, ఫ్లిప్‌కార్ట్, బ్లింకిట్ వంటి సంస్థల్లో, రైడ్ షేరింగ్, కొరియర్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో పని చేసే వాళ్లు ఈ గుర్తింపు కార్డులు పొందడానికి అర్హులన్నారు. https://register.eshram.gov.in/#/user/platform-worker వెబ్‌సైటులో స్వయంగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.



ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు.. ప్రశ్నిస్తున్న యువకుడు

సునీల్‌ది ఆత్మహత్య కాదు.. హత్య?

రాపాకలో మృతుడి బంధువులు, స్నేహితులు ఆందోళన

సీతానగరం,ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం మండలం రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామనగర్ రాజుగారి గార్డెన్స్ వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంబులెన్స్‌లో ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్న సునీల్ మృతదేహం ఉంచుకుని ఆందోళనకు దిగారు. మృతుడిది హత్య అని బంధువులు, స్నేహితులు సోమవారం రోడ్డెక్కారు. ఫంక్షన్‌హాల్ యజమాని అడ్డాల హరికృష్ణ రాజు, సునీల్‌తో ఉన్న మహిళ కలసి హత్యచేసినట్టు అనుమానంగా ఉందన్నారు. వారిని అదుపులోకి తీసుకుని హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారికి అడ్డంగా నిలబడి ధర్నా చేసే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. మృతదేహంతో ఆందోళనకు ప్రయత్నించడంతో 17 మంది అదుపులోకి తీసుకుని పోలీస్ వేన్ ఎక్కించి కోరుకొండ తరలించే ప్రయత్నం చేశారు. తరువాత అక్కడున్న వారిని చెదరగొట్టి అంబులెన్స్‌లో ఉన్న మృతదేహాన్ని బంధువులకు అప్పగించి పంపించారు. దీనిపై సీఐ బాలశౌరిని వివరణ కోరగా మృతుడు సునీల్‌కు వరుసకు మరదలైన మహిళ హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం ప్రైవేట్ బస్‌లో సీతానగరం చేరుకుని సునీల్‌ని కలిసిందన్నారు. తనతో పాటు ఉండాలని అడిగినా కాదనడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఇది హత్యగా అనుమానం వ్యక్తం చేస్తున్నందున అన్ని కోణాల్లోను దర్యాప్తు చేస్తామన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే వెంకటరాజు

విశ్వగురువు మోదీ : ఎంపీ

నల్లజర్ల,ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న విశ్వగురువు ప్రధాని మోదీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు,రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలిసి సోమవారం ప్రకాశరావుపాలెం నుంచి తెలికిచర్ల, చోడవరం, ఆవపాడు గ్రామాలను అనుసంధానం చేస్తూ 8.65 కోట్లతో బీటీ రోడ్లను నిర్మించేందుకు శంకుస్థాపనలు చేశారు. ఎస్సీ కాల నీలో రూ.69 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో 84 పంచాయతీలు అభివృద్ధి చేయాలన్నారు.కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, జనసేన ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు,బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర,తాతిన సత్యనారాయణ,వల్లూరి సత్తిపండు, పసుమర్తి రతీష్ పాల్గొన్నారు.

వెంకన్న క్షేత్రం.. కళ్యాణ సంబరం



ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ


ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

- వాడపల్లి వెంకన్న దివ్యకళ్యాణ మహోత్సవాలు ప్రారంభం
- ధ్వజారోహణంతో అంకురార్పణ
- నేడు తీర్థం, రథోత్సవం, కళ్యాణం

ఆత్రేయపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యకల్యాణ మహోత్సవాలు దశమి సోమవారం నుంచి ఘనంగా ప్రారంభయ్యాయి. వేకువజామునే మేల్కొపు, నిత్యబలిహరణ, బాలభోగ నివేదన, నిరాజన మంత్రపుష్పం అనంతరం భక్తులకు దర్శనాలు, సాయంత్రం విశ్వక్సేన ఆరా ధన, దీక్షాధారణ, వాస్తు పూజ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణంతో కార్యక్రమాలను నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేద పడింతులు ధ్వజపతాకం ఎగురవేసి కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఏకాదశి మంగళవారం స్వామివారిని మేల్కొపి భక్తులకు దర్శనాలు అందిస్తారు. మధ్యాహ్నం ఎదుర్కొలు ఉత్సవం నిర్వహించి వేలాది మంది భక్తుల నడుమ రథోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి శ్రీనివాస ప్రాంగణంలోని సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదిక వద్ద జగత్ కల్యాణార్థం స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావులు కలిసి కల్యాణ వేదిక, పుష్కరఘాట్లు, రథోత్సవం నిర్వహించే మాడవీధులు, భక్తుల సౌకర్యాలపై పరిశీలించి చర్చించారు. వివిధ డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు వస్తున్న దృష్ట్యా పార్కింగ్ నిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు.


పిండి ముగ్గుతో స్వామి చిత్రం

కడియం బుర్రిలంకకు చెందిన రూప అనే భక్తురాలు సోమవారం పిండి ముగ్గుతో శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రం గీసి ఆకట్టుకుంది.

విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణలు

శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదికను వివిధ రకాల పుష్పాలతో అలంకరించే పనిలో నిపుణులు నిమగ్నమయ్యారు. 10వేల మంది వీఐపీలు, భక్తులు, ప్రముఖులు, స్వామి వారి కల్యాణం తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రావుల పాలెం నుంచి బొబ్బర్లంక, లొల్ల నుంచి వాడపల్లి వరకూ స్వాగత ద్వారాలు, ఎల్ఈడీ విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంతో పాటు మాడవీధులు దేవతామూర్తులతో పాటు విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఫలపుష్పాలతో స్వామివారి ఆలయాన్ని అలంకరించారు.



యనమల రాజకీయ ప్రస్థానంపై పుస్తకం

10న తునిలో పుస్తకావిష్కరణకు ఏర్పాట్లు

ముఖ్య అతిథులుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత


తునిలో కూటమి నాయకులతో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజా అశోక్‌బాబు

తుని రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): యనమల రామకృష్ణుడు రాజకీయ జీవితంపై '42వ వసంతాల యనమల రాజకీయ ప్రస్థానం' పేరుతో పుస్తకం ప్రచురించారు. ఈనెల 10న కాకినాడ జిల్లా తునిలో ఈ పుస్తకావిష్కరణ, ఆత్మీయ సన్మాన వేడుకను అట్టహాసంగా నిర్వహించేందుకు కూటమి శ్రేణులు సన్నద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా తునిలో మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత రాజా అశోక్‌బాబు పార్టీ శ్రేణులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 42 ఏళ్ల యనమల రాజకీయ ప్రస్థానంలో ఆయన మచ్చలేని నాయకుడిగా వెలుగొందారని, ఇది రాజకీయాల్లో అద్భుత ఘట్టమని అన్నారు. సుదీర్ఘ రాజకీయాల్లో యనమల స్పీకర్‌గా, పలుమార్లు మంత్రిగా, ఎమ్మెల్యేగా పదవులను అలంకరించి ఆ పదవులకే వన్నె తెచ్చేలా స్ఫూర్తిదాయకమైన పాలన అందించారన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలకమైన వ్యక్తిగా గొప్ప వ్యక్తిత్వం ఉన్న తుని ప్రాంతవాసి అయిన ఆయనను ఈ నెల 10న తునిలో సత్కరించుకునే అవకాశం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత విచ్చేయనున్నారని తెలిపారు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు కూడా హాజరుకానున్నారన్నారు. కూటమి పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొచ్చెర్లపాటి రూపాదేవి, మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ తుని పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, మాజీ కౌన్సిల ర్లు మళ్ల గణేష్, జల్లు వాసు, కుక్కడపు బాలాజీ, టీడీపీ నాయకులు తమరాన సత్యనారాయణ, ఆవుగడ్డి వెంకటరమణ, తమరాన రామకృష్ణ, కోడా వెంకటరమణ పాల్గొన్నారు.

'ఉమ్మడి తూర్పు'లో జడ్జీల బదిలీలు

రాజమహేంద్రవరం/కాకినాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు న్యాయమూర్తులు బదిలీ అయ్యారు. ఐదో అదనపు జిల్లా జడ్జి డి.విజయ్‌గౌతమ్ 12వ అదనపు జిల్లా జడ్జిగా విశాఖపట్నం, పిఠా పురం 12వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎ.వా సంతి నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జిగా.. కాకినాడలో మూడో అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న పి.కమలాదేవి కర్నూలు ఒకటో అదనపు జిల్లా జడ్జిగా.. అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేశ్ అనకాపల్లి పదో అదనపు జిల్లా జడ్జిగా.. కాకినాడ ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత ఆర్.వోరా నెల్లూరు ఫ్యామిలీ కమ్ ఆరో అదనపు జిల్లా జడ్జిగా, రాజమహేంద్ర వరంలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు జడ్జి ఆర్.శ్రీలత మదనపల్లె ఏడో అడిషనల్ జి ల్లా జడ్జిగా, ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు న్యాయ మూర్తి పీవీఎస్ సూర్యనారా యణమూర్తి మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జిగా, రామచంద్రాపురం అదనపు జిల్లా జడ్జి ఎం.శంకరరావు చిత్తూరు పోక్సో కోర్టు జడ్జిగా, అనంతపురం జిల్లా గూటిలోని 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరిని పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

జనసేన నేతల మధ్య భగ్గుమన్న విభేదాలు

- జనసేన నాయకుడిపై అయినవిల్లి మండలాధ్యక్షుడు హత్యాయత్నం
- మండలాధ్యక్షుడు కారు ధ్వంసం చేసిన వ్యతిరేక వర్గీయులు
- ఇరు వర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసిన అయినవిల్లి పోలీసులు


అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోలేటి ఉమా


పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ప్రశ్నిస్తున్న ఉమా వర్గీయులు

అమలాపురం/అయినవిల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న పి.గన్నవరం ఎస్సీ రిజర్వు నియోజకవర్గ పరిధిలోని అయినవిల్లి జనసేన నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. జనసేన నాయకుడిపై మండలాధ్యక్షుడు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి తాలూకా బంధువులు మండలాధ్యక్షుడి వాహనాన్ని ధ్వంసం చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. క్షతగాత్రుడిని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఏరియా ఆసుపత్రిలో పరామర్శించడానికి వచ్చినప్పుడు బాధితుడి బంధువులు ఎమ్మెల్యేపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం కోనసీమ జిల్లా పి.గన్నవరం మండల జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మార్కెట్ కమిటీ వ్యవహారంపై ఇద్దరు నాయకుల మధ్య వచ్చిన విబేధాలు ఇందుకు కారణంగా భావిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అయినవిల్లికి చెందిన జనసేన నాయకుడు తోలేటి ఉమా ఇంటిపై మండలాధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్ తన అనుచరులతో కలిసి వెళ్లి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఉమా, అతని భార్యపై రాజేష్‌తో పాటు మరికొందరు దాడి చేసి ఉమాను తీవ్రంగా గాయపరిచారు. ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో అడ్డువచ్చిన అతని భార్యపై కూడా దాడికి తెగబడ్డారు. తలపై బలమైన గాయం తగిలిన ఉమాను అమలాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తోలేటి ఉమాపై దాడి చేసిన పోలిశెట్టి రాజేష్ ఇంటిపైకి ఉమా వర్గీయులు ఎదురు దాడికి వెళ్లి బయట ఉన్న రాజేష్ కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ వ్యవహారం మండలంలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. అయితే గాయపడ్డ తోలేటి ఉమాను పరామర్శించేందుకు సోమవారం పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఏరియా ఆసుపత్రికి వచ్చిన క్రమంలో ఆయనతో ఉన్న కొందరు నాయకులు మీడియాపై తీవ్రమైన ఆంక్షలు విధిస్తూ వీడియోలు తీయకుండా అడ్డుకున్నారు. పరామర్శ అనంతరం బయటికి వచ్చిన ఎమ్మెల్యే సత్యనారాయణను బాధితుడైన ఉమా వర్గం నాయకులు నిలదీశారు. పార్టీ మండలాధ్యక్షుడై ఉండి ఈ విధంగా దాడులకు పాల్పడ్డగా ఏం చర్యలు తీసుకుంటారంటూ గట్టిగా నిలదీశారు. దాంతో ఈ వివాదంపై జనసేన పార్టీ అధిష్టానానికి నివేదిస్తూ లేఖ రాస్తానని, ఇది మా కుటుంబ సమస్య చర్చించి పరిష్కరించుకుంటామంటూ సమాధానమిచ్చారు. అయితే ఈ వివాదంపై అయినవిల్లి పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించి కేసులు నమోదు చేశారు. దీనిలో భాగంగా బాధితుడైన ఉమా భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్యర్థి వర్గానికి చెందిన జనసేన పార్టీ మండలాధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, అబ్బిరెడ్డి యుగంధర్, పోలిశెట్టి రవి, మరో ఇద్దరిపై సెక్షన్ 329 (4), 109 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదేవిధంగా రాజేష్ కారు ధ్వంసానికి సంబంధించి రాజేష్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 361(6), 329(3), రెడ్ విత్ 35 సెక్షన్ కింద అయినవిల్లి పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన సంతకాలు ఆటోగ్రాఫ్‌గా మారాలి

ఉన్నత లక్ష్యాలతోనే దేశాభివృద్ధి : విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ



నన్నయ విశ్వవిద్యాలయంలో లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నన్నయ వీసీ, అధికారులు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మనల్ని చూసి గర్వపడడం, చదువుకున్న విద్యాసంస్థకు ముఖ్యఅతిథులుగా రావడం, మన సంతకాలు ఆటోగ్రాఫ్‌లుగా మారడం వంటి మూడు విషయాలను యువత లక్ష్యాలుగా నిర్దేశించుకోవాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఇటువంటి లక్ష్యాలతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం జాతి నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి యువత మొబైల్‌ఫోన్‌లతో బిజీగా ఉన్నారని రీల్స్‌షాట్స్ చూస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని, మద్యం నాన్న రక్తం, ధూమపానం అమ్మ ఊపిరి తాగుతున్నాం అని గుర్తు చేసుకోవాలన్నారు. మన స్నేహితులు మంచి వారై ఉండాలని తద్వారా మనం ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్నారు. మహనీయుల చరిత్రను చదువుకోవాలని చెప్పారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ యువత ఒక దేశ బలం, పురోగతికి మూలస్తంభాలుగా ఉంటారన్నారు. సమాజంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకురావడంలో యువత గణనీయమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. బలమైన నైపుణ్యంగల యువత భారత దేశ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వారి పాత్రను వివరించారు.

బాయిలర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి


మృతిచెందిన శివ

పెద్దాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బాయిలర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మం డలం వాలుతిమ్మాపురం రహదారిలో ఉన్న ఓ రైస్ మిల్లులో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయవాడ నగరానికి చెందిన వేముల శివ (29) ఫ్యాక్టరీకి పని మీద వచ్చి ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయాడు. ఇంతలో బాయిలర్ నుంచి విడుదలైన వేడి నీటి కారణంగా మృతిచెందినట్టు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై సీఐ విజయశంకర్ ఆదేశాలతో ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మాంసం వ్యాపారికి తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 7 (ఆం ధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో మాంసం వ్యాపారి తీ వ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు కు చెందిన పిల్లి అప్పారావు సోమవారం మేకలు కొనుగోలు చేసేందుకు చేబ్రోలు మోటార్‌సైకిల్‌పై వెళ్తు న్నాడు. పట్టణ శివారులోని రైసుమిల్లు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో అప్పారావుకు తీ వ్రగాయాలై అ పస్మారక స్థితికి చేరుకున్నాడు. తొలుత పిఠాపురం, అక్కడ నుంచి కాకినాడలోని ప్రవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలోకి స్కూలు వ్యాన్ బోల్తా

ఏడుగురు విద్యార్థులు, డ్రైవర్‌కు గాయాలు


కాలువలోకి దూసుకుపోయి బోల్తాపడిన వ్యాన్

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారులో కాలువలోకి స్కూలు వ్యాన్ బోల్తా పడి ఏడుగురు విద్యార్థులు, డ్రైవర్ గాయపడ్డారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులోని ఒక ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన స్కూలు మినీ వ్యాన్ చెందుర్తిలో పది మంది విద్యార్థులను ఎక్కించుకుని బయల్దేరింది. చెందుర్తి శివారులోకి వచ్చేసరిగా ఎదురుగా వస్తున్న లారీ మీదకు రావడంతో మినీవేన్‌ను డ్రైవర్ తప్పించబోయాడు. అదుపు తప్పడంతో కాలువలోకి దూసుకుపోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జి.హర్షిత, అపర్ణ, సిద్ధు, ధరణి, కె.భార్గవ్, హాసిని, నిహారికలకు గాయాలయ్యాయి. డ్రైవర్‌కు కాళ్లు విరిగాయి. పాఠశాల యజమాన్య ప్రతినిధులు వారిని చికిత్స నిమిత్తం పిఠాపురంలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. ఒక విద్యార్థిని మాత్రం కాలువలో నీరు ఎక్కువగా తాగడంతో అస్వస్థతకు గురైంది. క్షతగాత్రులను పిఠాపురం సీఐ శ్రీనివాస్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు అక్కడికి చేరుకుని తమ వారికి ఏమైందోనని ఆందోళనకు గురయ్యారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

నేటి నుంచి కాకినాడలో ఇండో-అమెరికా సైనిక విన్యాసాలు

130 మంది పోలీసులతో బందోబస్తు

ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్‌డీపీవో

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో ఈ నెల 8 నుంచి 13 వరకు జరిగే ఇండో-అమెరికా సైనిక విన్యాసాల టైగర్ ట్రయాంఫ్-25 కోసం 130 మంది పోలీసులతో కట్టుదిట్టమైన పటిష్ట భద్రతా బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్టు కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన సూర్యారావుపేట బీచ్‌లో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ లు, ఏఎస్ఐలు, హెచ్‌సీ, పీసీలతో బందోబస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. సైనిక విన్యాసాలు జరిగే రోజుల్లో మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు నిషేధిత ప్రాంతాల్లోకి రాకూడదన్నారు. మంగళవారం నుంచి 13వ తేదీ వరకు లైట్‌హౌస్ నుంచి ఉప్పాడ వరకు ఎటు వంటి వాహనాలకు ప్రవేశం లేదన్నారు. సైనిక విన్యాసాల్లో పూర్తి అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆయన ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లు, ఇరుదేశాల త్రివిధ దళాల అధికారులు, సిబ్బందికి వసతి, ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం సైనిక విన్యాసాలు జరిగే నావెల్ ఎన్‌క్లేవ్ పరిసర ప్రదేశాలను పరిశీలించారు. తిమ్మాపురం ఎస్ఐ, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత పాల్గొన్నారు.


సూర్యారావుపేట బీచ్‌లో బందోబస్తు ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, సీఐ చైతన్యకృష్ణ

21.6 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

రాజానగరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న 3 వాహనాలను రాజానగరం సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ గొలుగూరి బాపిరాజు సోమవారం దాడి చేసి పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారిపై రాజానగరం పరిధిలోని జీఎస్ఎల్ సమీపంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా 3 వాహనాలను ఏక కాలంలో పట్టుకుని సీజ్ చేశామన్నారు. గొల్లప్రోలుకు చెందిన ఆకుల స్వామి డ్రైవర్‌గా ఉన్న ఏపీ 39-యు.బి 1314 వాహనంలో 15,390 కిలోల బియ్యం, పెద్దాపురం మండలం గోరంట్ల గ్రామానికి చెందిన కోరుకొండ అచ్చిరాజు డ్రైవర్‌గా ఉన్న ఏపీ 39 యు.ఏ 6550 నంబరు గల వాహనంలో 3,670 కిలోలు, కోనబాలరాజు డ్రైవర్ ఉన్న ఏపీ39-యు.ఐ 5549 నెంబరు కలిగిన వాహనంలో 2,540 కిలోల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్టు పేర్కొన్నారు. పౌరసరఫరాలుశాఖ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం కోర్టులో నిత్యావసర వస్తువుల చట్టం కింద బియ్యం, డ్రైవర్లతో పాటుగా వాహన యజమానులపై సెక్షన్ 6ఏ కేసు నమోదు చేసి రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.9,93,600, వాహనాల విలువ రూ.20 లక్షలు కలిపి మొత్తం విలువ రూ.29,93,600గా నిర్ధారించామన్నారు.


రేషన్ బియ్యంతో స్వాధీనం చేసుకున్న వాహనాలు

గంజాయితో వ్యక్తి అరెస్టు

21 కిలోల స్వాధీనం : డీఎస్పీ


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

బిక్కవోలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామం తూర్పు శివారు జగనన్న కాలనీ వద్ద సీతారామచెరువు వద్ద అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన మరుకుర్తి సూర్యప్రకాష్‌ను 21 కిలోల గంజాయితో ఎస్ఐ అరెస్ట్ చేసినట్టు రాజమహేంద్రవరం డీఎస్పీ బి.విద్య తెలిపారు. సోమవారం రాత్రి ఆమె బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు తెలిపారు. సూర్యప్రకాష్ పదో తరగతి వరకూ చదివి మానేసి అతడి బావతో కలసి చికెన్ షాపు నిర్వహించేవాడు. ఆపై అతడితో గొడవ పడి అల్లూరి సీతారామరాజు జిల్లా కె.పెదబయలు గ్రామానికి చెందిన వంతల పంతులుబాబుతో కలిసి ఎక్కువ డబ్బులు సంపాదించాలనుకున్నాడు. వారిద్దరూ జి.మాడుగుల చుట్టుపక్కల గ్రామాల్లో తిరిగి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయిని కొని వాటిని ఎక్కువ ధరకు అమ్మి వచ్చిన సొమ్మును సమానంగా పంచుకునేవారు. ఆ తర్వాత ప్రకాష్ కాకినాడ జిల్లా ఉప్పాడలో చికెన్ సెంటర్‌లో పనికి చేరాడు. అదే సమయంలో అతడికి పాత నేరస్తుడైన స్నేహితులు ఆవాల మణికంఠ, తోలుం రాజు పరిచయమయ్యారు. ముగ్గురూ కలిసి మోటార్‌సైకిళ్ల దొంగతనాలు చేద్దామనుకుని మార్చి మొదటివారంలో బిక్కవోలులో రెండు బైక్‌లు దొంగతనం చేశారు. వాటిలో ఒక దానిని ప్రకాష్.. పంతులుబాబుకు ఇచ్చి దానికి బదులుగా సుమారు 21 కిలోల గంజాయిని తీసుకున్నాడు. ఆపై బిక్కవోలు గ్రామం శివారుకు వచ్చి స్నేహితులైన మణికంఠ, రాజు కోసం వేచి చూస్తుండగా సమాచారం మేరకు ఎస్ఐ రవిచంద్ర కుమార్ అరెస్టు చేశారని, పంతులుబాబు పరారీలో డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ సుమంత్,ఎస్ఐ రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

లారీల లింక్.. డేంజర్ బ్లింక్..

మరమ్మతులకు గురైన లారీ ముందు భాగాన్ని మరో లారీకి కట్టి తీసుకెళ్తున్న దృశ్యం కాకినాడ జిల్లా బెండపూడి నుంచి రాజమహేంద్రవరం వైపు నేషనల్ హైవేపై కనిపించింది. అయితే ఏమాత్రం ఆ లారీల లింక్ తెగినా వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు.
-ఫొటోగ్రాఫర్, కాకినాడ



వడగళ్ల వాన



గోకవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సూర్యప్రతాపానికి అల్లాడిపోతున్న గోకవరం మండల ప్రజానీకానికి సోమవారం సాయంత్రం చల్లటి గాలులతో కురిసిన వడగళ్ల వాన కొంత ఊరటనిచ్చింది. సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై సుమారు రెండు గంటల పాటు ఓ మోస్తరు వర్షం పడింది. కాగా వడగళ్లతో వాన వల్ల మామిడితోటలకు నష్టం వాటిల్లితుందని రైతులు లబోదిబోమంటున్నారు. వరి పంటకూ నష్టం తప్పదని రైతాంగం వాపోయింది.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితో బాటు పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రామవరంలో నిర్మించనున్న ఏడు సీసీ రోడ్ల పనులకు ఆయన సోమవారం భూమిపూజ నిర్వహించారు. కుతుకులూరు గ్రామంలో నిర్మించనున్న పది సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ, నిర్మించిన రెండు సీసీ రోడ్లకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అలాగే పొలమూరు గ్రామంలో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి అనేది ప్రజలు మరచిపోయారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలలకే అభివృద్ధి ఏమిటో చూస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు గిరిడా గంగాభవాని, గొల్లు హేమతులసి, నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, చింతా సురేష్‌రెడ్డి, తేనెల శ్రీనివాస్, కర్రి చిన్నారెడ్డి, ద్వారంపూడి ఈశ్వర రెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు.

పందలపాక కబడ్డీ లీగ్ విజేత పీఆర్ కాలేజీ



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గెలుపు, ఓటములను క్రీడా స్ఫూర్తితో తీసుకున్నప్పుడే క్రీడాకారులు రాణించగలరని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. పందలపాకలో గత నెల 30న గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పందలపాక కబడ్డీ లీగ్ సీజన్-4 పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. పోటీల్లో 26 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో టీమ్ ఎస్‌పీఎల్ జట్టుపై కాకినాడ పీఆర్ కాలేజీ జట్టు విజయం సాధించి ప్రథమస్థానం దక్కించుకుంది. దీంతో పీఆర్ కాలేజి జట్టుకు ఎమ్మెల్యే రూ.33,333 చెక్కును, ట్రోఫీని అందజేశారు. రెండు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచిన టీమ్ ఎస్‌పీఎల్, కాకినాడ ఐడియల్ కాలేజీ, మెళ్లూరు జట్లులకు నగదు బహుమతులను అందజేశారు. అనంతరం పందలపాక అప్పారావును ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో శీలం దుర్గారావు, బోగాది వెంకటరమణ, పడాల చినబుజ్జి, రావాడ నాగు, గుణ్ణం శ్రీనివాసచౌదరి, పల్లి శ్రీనివాసరెడ్డి, ఇందల వీరబాబు, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

సీఐ కుటుంబానికి రుడా చైర్మన్ పరామర్శ

రాజానగరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పితృవియోగంతో బాధపడుతున్న రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ కుటుంబాన్ని రాజమహేంద్రవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(రుడా)చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి సోమవారం పరామర్శించారు. సీఐ స్వగ్రామమైన ద్వారకాతిరుమల మండలం తిరుమలపాలెంలోని సీఐ తండ్రి సిరిబత్తుల సూర్యారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీవీఆర్ సీఐ వీరయ్యగౌడ్‌ను పలకరించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కందుల బాబూరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేమగిరిలో 'తిరుమల' ప్రాంగణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న తిరుమలరావు దంపతులు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తిరుమల విద్యాసంస్థలు తమ నూతన ప్రాంగణాన్ని కడియం మండలం వేమగిరిలో ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు, సరోజిని దేవి దంపతులు సోమవారం వేమగిరి హైవే పక్కన ప్రాంగణాన్ని నిర్మించేందుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ వేమగిరి చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులు వారి తల్లి దండ్రుల కోరిక మేరకు తమ డే స్కాలర్ క్యాంపస్‌ను వేమగిరిలో ప్రారంభిస్తున్నామని, ఈ క్యాంపస్‌లో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు క్లాసులు జరుగుతాయని తెలిపారు. 2026-27 నుంచి అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో తిరుమల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను అప్పగించాలి

ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజబాబు

బిక్కవోలు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాపవరం గ్రామంలోని మువ్వ మంగన్నకు చెందిన అసైన్డ్ భూములను తిరిగి మంగన్న వారసులకు అప్పగించాలని ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘ సభ్యులతో కలసి స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1983లో బలభద్రపురానికి చెందిన ముువ్వా మంగన్నకు కాపవరంలోని సర్వే నెంబరు 150లో ఐదెకరాల భూమిని ప్రభుత్వం అసైన్డ్ చేసిందని, ఆపై మంగన్న చనిపోవడంతో ఆయన కుమారులు పండించుకుంటున్నారన్నారు. అయితే ఈ భూములను గొల్లల మామిడాడకు చెందిన కోనాల తమ్మిరెడ్డి కౌలుకు సాగుచేస్తూ తన పేరుతో ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయించుకున్నాడన్నారు. తక్షణమే ఈభూములపై విచారణ జరిపి మంగన్న కుటుంబీకులకు ఆభూములను అప్పగించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో తహశీల్దార్ సత్యకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో కర్నాకుల రామలింగేశ్వరరావు, బొచ్చ యేసు, దేశెట్టి సురేష్, బి. శ్రీనివాస్, ఎం. వీరలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి

రాజానగరం ఎమ్మెల్యే బత్తుల



జనవాణిలో అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో పల్లెబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిపై సంబంధిత అధికారులతో చర్చించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ వీర్రాజు విజయోత్సవ ర్యాలీ

గోకవరం, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు రెండో సారి ఎమ్మెల్సీగా నియమితులైన సందర్భంగా ఈ నెల 8న విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. గోకవరంలో సోమవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఉదయం 7.30గంటలకు రామసేన సభ్యులు, బీజేపీ శ్రేణులు సీఎండీ లేఅవుట్‌కు చేరుకొని అక్కడ నుంచి ర్యాలీగా కోరుకొండ మీదుగా రాజమహేంద్రవరం చేరుకొంటుందన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీర్రాజును సత్కరించనున్నట్టు చెప్పారు.

వేర్వేరుచోట్ల ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తుల మృతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వేర్వేరు చోట్ల ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. స్థానిక జాంపేటలోని రాయల్ ఫ్యామిలీ రెస్టారెంట్ సమీపంలో సుమారు 50 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మద్యం మత్తులో రోడ్డుపై పడి మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియలేదు. ఈ మేరకు వీఆర్‌వో ఇచ్చిన ఫిర్యాదుతో వనటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. అలాగే స్థానిక ఆల్కట్ గార్డెన్స్ సమీపంలో సుమారు 55 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతిచెంది పడి ఉన్నాడు. మృతుడు స్థానికంగా యాచకత్వం చేస్తుండేవాడని తెలిసింది. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అంబేడ్కర్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. సోమవారం స్థానిక తిలక్‌రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో దళిత నాయకులు కాశి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు తాళ్ళూరి బాబు రాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి సమక్షంలో పోస్టర్‌ను ఆదిరెడ్డి వాసు ఆవిష్కరించారు.

పోషకాహారానికి ప్రాధాన్యమివ్వాలి

» పాలచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి బెనడిక్ట్

» ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



పాలచర్లలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బెనడిక్ట్

దివాన్‌చెరువు ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజలు తాము తీసుకునే ఆహారంలో పోషక విలువలు కలిగిన ఆహారానికి ప్రాధాన్యమివ్వాలని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం పాలచర్లలోని అంగన్వాడీ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణ ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఏటా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చిన్నారులకు అవసరమైన పోషకాహారాన్ని వారికి ఐదేళ్ల వయస్సు వచ్చే వరకూ అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. అలాగే ప్రజలకు అవసరమైన మందులను పీహెచ్‌సీలు, ఆయుష్మాన్ భరత్ కేంద్రాలు ద్వారా ప్రభుత్వమే అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పాలచర్ల పీహెచ్‌సీ సీహెచ్‌వో మేరీహెప్సీ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ, డీఎంహెచ్‌వో సంయుక్తంగా ఎస్టీ వసతిగృహంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కువగా మంచినీరు తాగాలని సూచించారు. విద్యార్థులకు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని అందించాలని, పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. వసతి గృహంలో ఎలాంటి అసౌకర్యం కలిగినా డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులతో చెప్పారు. వైద్య శిబిరంలో హిమోగ్లోబిన్, బీపీ, డయాబెటిస్ తదితర వైద్య పరీక్షలను చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలోని వన్‌స్టాప్ కేంద్రాన్ని ఆమె సందర్శించి సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి, వివిధ విభాగాల డాక్టర్లు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సాయికృష్ణ థియేటర్ వద్ద ఎస్‌జీఎస్ ప్రభుత్వ ట్రైనింగ్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యుడు, కేఎస్ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కొమ్మా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలు, చేతబడులు, తావీదులతో చేస్తున్న మోసాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రజలు ఈ రోజుల్లో కూడా స్వామీజీలు, కోయదొరల చేతుల్లో మోసపోయి, డబ్బులు,ప్రాణాలు కూడా పోగొట్టుకొంటున్నారని ఆందోళన వ్యక్తపరిచారు. అనంతరం సంస్థ ప్రతినిధులు అవయవ దానంపై అవగాహన కలిగించారు. తదుపరి కళాశాల ప్రిన్సిపాల్.. డాక్టర్ బ్రహ్మాచారి,డాక్టర్ జ్యోత్స్న డాక్టర్ కొమ్మా సుస్మితలను సత్కరించారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, పి.కృష్ణప్రసాద్ రెడ్డి, ప్రియదర్శిని, కె.ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ సత్యాజీ, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: గోకవరం ప్రభుత్వాసుపత్రి వద్ద ప్రజలకు, వీరలంకపల్లి అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మితాహారం తీసుకోవడంతో పాటు, తగినంత వ్యాయామం చాలా అవసరమని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి తిరన్, పలువురు వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

కడియం: కడియం సీహెచ్‌సీ పరిధిలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని, వారికి పోషకాహార అవసరతను తెలియచేసి సమయానుకూలంగా వ్యాధినిరోధక టీకాలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వైఎస్ సుబ్బారాయుడు, సూపర్‌వైజరు కె.సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కడియంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని డివిజన్లలో మెరుగైన పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో పలు డివిజన్ల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన 23 అర్జీలు స్వీకరించారు. ఇళ్ల స్థలాల ఆక్రమణలు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలు, ఇంటి పన్నుల పేరుమార్పులు తదితర సమస్యలపై అర్జీలు పెట్టుకున్నారు. వాటిని పరిశీలన చేసి నాణ్యమైన పరిష్కారాలు చూపించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

ఆక్రమణలు తొలగించాలి

నగరంలోని కోరుకొండ రోడ్డులో కమిషనర్ కేతన్‌గార్గ్ తనిఖీలు చేశారు. రహదారి విస్తరణకు మార్కింగ్ వేయాలని, తాత్కాలిక, శాశ్వత ఆక్రమణలను గుర్తించి తక్షణమే తొలగించాలని అధికారులకు సూచించారు. నగరంలో ఆక్రమలు తొలగింపు ప్రక్రియ ప్రతిరోజు జరగాలన్నారు. సీఅండ్‌డీ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, నిర్మాణంలో ఉన్న భవనాలను ఆకుపచ్చగుడ్డతో మూసివేసేలా నిర్మాణదారులకు తెలియజేయాలని చెప్పారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని వెబ్ ఎక్స్ ద్వారా కమిషనర్ సచివాలయ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి అధికారి సిబ్బంది తమకు కేటాయించిన విధులపై ఉదయం తనిఖీలు నిర్వహించాలని, ఎమినిటీ సెక్రటరీలు ఉదయం 6నుంచి నీటి సరఫరాను పరిశీలించాలని, శానిటేషన్ సెక్రటరీలు డ్రైన్లలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించే పనులు చేయించాలని పేర్కొన్నారు. పన్నుపై 5శాతం రాయితీ అంశాన్ని నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. కార్యక్రమాల్లో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ ఎ.వినూత్న, సెక్రటరీ శైలజావల్లి, మేనేజరు అబ్దుల్ మాలిక్ అస్ఫర్, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్లను సచివాలయాలుగా మార్చేశారు

మేము సరిచేస్తున్నాం : ఎమ్మెల్యే వాసు



కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం కమ్యూనిటీ హాళ్లను సచివాలయాలుగా మార్చేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 4వ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, రాజేంద్రనగర్‌లో 3,4 డివిజన్లకు చెందిన సచివాలయాలను అదే ప్రాంతంలో కార్పొరేషన్‌కు చెందిన భవనాల్లోని మార్చేందుకు జరుగుతున్న పనులను ఆయన సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాలుగా ఉన్న కమ్యూనిటీ హాళ్లను తిరిగి పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పేదల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని టీడీపీ హయాంలో కమ్యూనిటీ హాళ్లను నిర్మించారని, అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని సచివాలయాలుగా మార్చేసిందని, అయితే తాము కమ్యూనిటీ హాళ్లను తిరిగి పేదలకే కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, నక్కా చిట్టిబాబు, దొండపాటి సత్యంబాబు, నక్కా దేవివరప్రసాద్, బొమ్మనమైన శ్రీనివాస్, జక్కంపూడి అర్జున్, యాళ్ల శ్రీను పాల్గొన్నారు.

ప్రసూతి, శిశుమరణాలను నివారించాలి

పీఎంపీలకు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తల్లులు, నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి పెట్టి ప్రసూతి శిశుమరణాలను నివారించేందుకు వారి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించేందుకు పీఎంపీలు కృషి చేయాలని పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీటీటీ రాజు అన్నారు. స్థానిక జేఎన్ రోడ్‌లోని ఎంఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డెల్టా హాస్పిటల్ శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ నితిన్ నిమ్మలపూడి మాట్లాడుతూ అధునాతన శస్త్ర చికిత్స విధానాలను, వేరికోసిస్, ఫైల్స్, హెమరాయిడ్స్‌కు లేజర్ చికిత్స, హెర్నియా మొదలైన శస్త్ర చికిత్సల గురించి వివరించారు. క్యాన్సర్ నిపుణురాలు డాక్టర్ దివ్య, డాక్టర్ చైత్ర, మహిళల్లో వివిధ ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ చర్యలను వివరించారు. అనంతరం వైద్యులను, పీఎంపీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో తోరాటి ప్రభాకరరావు, గంగుమళ్ల రాంబాబు, కోన చిన్నారావు, బుడ్డిగ అప్పారావు, రహమాన్ ఖాన్, ఎ.ధనుంజయ్ పాల్గొన్నారు.

ఇద్దరు మహిళలు అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సింహచల్ నగర్‌కు చెందిన దుర్గ ఈ నెల 5వ తేది నుంచి కనిపించడంలేదని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానికంగా డీమార్టులో పనిచేస్తున్న దుర్గకు భర్త, పిల్లలు ఉన్నారు. భర్త దేవిపట్నంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 5న డీమార్టుకు వెళ్లిన దుర్గ తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడం ఆమె తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. అలాగే స్థానిక కోటిలింగాలపేటకు చెందిన 23ఏళ్ల యువతి గత నెల 30వ తేదీ నుంచి కనిపించడం లేదని త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికంగా షాపింగ్ మాల్‌లో పనిచేసే యువతి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతులకు అహల్యాబాయి స్ఫూర్తి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మాల్వాప్రాంతపు గొప్పనాయకురాలు, నిర్వాహకురాలు ధైర్యవంతురాలైన మహారాణి అహల్యాబాయి హోల్కర్ నేటి యువతులకు స్ఫూర్తి అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్సిటీలోని వర్సిటీ ఉమెన్స్‌సెల్, ఆంధ్ర శక్తి, మహిళాశక్తి గోదావరి విభాగం ఆధ్వర్యంలో మాల్వాసామ్రాజ్యపు హోల్కరు వంశరాణి అహల్యాబాయి హోల్కర్ జయంతిని సోమవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి వీసీ నివాళులు అర్పించారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ఈసీ సభ్యుడు వోలేటి సత్యనారాయణ ఆమె జీవిత చరిత్రలోని ప్రధానాంశాలను తెలిపారు. కార్యక్రమంలో ఉమెన్‌సెల్ కోఆర్డినేటర్ ఆచార్య పి.ఉమామహేశ్వరి దేవి, ఆంధ్ర శక్తి రాష్ట్ర కోఆర్డినేటర్ పద్మావతి వానపల్లి, ప్రిన్సిపాల్స్ డి.జ్యోతిర్మయి, విజయనిర్మల పాల్గొన్నారు.

పారా మెడికల్ విద్యలో ఉచిత శిక్షణ

మీసాల ఫౌండేషన్ చైర్మన్ సతీష్

అనపర్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ విద్య పూర్తి చేసిన విద్యార్థులకు పారా మెడికల్‌లో ఉచిత విద్య, ఉద్యోగవకాశాలు కల్పించనున్నట్టు మీసాల ఫౌండేషన్ చైర్మన్ మీసాల సతీష్ విలేకరులకు తెలిపారు. మీసాల ఫౌండేషన్, రమాదేవి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 20న జరిగే ప్రవేశ పరీక్షలో పాల్గొనాలని ఆయన కోరారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రెండేళ్ల పాటు పారా మెడికల్‌లో ఉచిత విద్యను అందించడమే కాకుండా ఉద్యోగాలు కూడా కల్పిస్తామన్నారు. శిక్షణ సమయంలో పారితోషికం కూడా అందిస్తామని సతీష్ తెలిపారు. మరిన్ని వివరాలకు 79012 27222 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కడియం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడియం, జేగురుపాడు గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కడియంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబబంటి నాని, సర్పంచ్ మోసిగంటి సత్యవతి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జేగురుపాడులో కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ యాదల స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ పంటకు సంబంధించి ప్రభుత్వం క్వింటాకు రూ.2,300 మద్దతు ధర ప్రకటించిందని, 75 కిలోల బస్తాకు(సాధారణ రకం) రూ.1,725 అని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీలు నాగిరెడ్డి రామకృష్ణ, ఆకుల సుధాకర్,నాయకులు మర్రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

కోరుకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగ పట్నంలో రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువుల్లో సాధారనంగా వచ్చే వ్యాధులను వివరించారు. మూగజీవాల్లో వచ్చే జబ్బులపై అవగాహన కల్పించారు. పశువైద్య అధికారి డాక్టర్ రాజశేఖర్ పశువుల్లో సాధారణంగా వచ్చే వ్యాధులు వాటిని గుర్తించే లక్షణాలు, నివారణ మార్గాలపై రైతులకు అవగాహన కల్పించారు. తమ ఇళ్ళల్లోని జంతువులను ఎలా సంరక్షించాలో విద్యార్థులకు వివరించారు.

గోదారిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



కొవ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు కం రైలు వంతెన పైనుంచి గోదావరి నదిలో దూకి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం విద్యుత్‌నగర్‌కు చెందిన సబ్బెళ్ళ శ్రీనివాసరెడ్డి (50) ప్రైవేటు కంపెనీలో వర్క్ ఫ్రం హోంగా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి స్కూటీపై రోడ్డు కం రైలు బ్రిడ్జి పైకి వచ్చాడు. 103వ స్తంభం వద్ద బండిని పార్క్ చేసి గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. అటుగా వెళ్తున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ పి.విశ్వం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని స్థానిక జాలర్ల సాయంతో మృతదేహాన్ని నది నుంచి ఎరినమ్మఘాట్ వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా శ్రీనివాసరెడ్డికి భార్య సబ్బెళ్ల భువనేశ్వరి, కుమారుడు సాయిఅమిత్ ఉన్నారు. మృతుడి భార్య అందించిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఎంవీ సత్యనారాయణ కేసునమోదు చేసినట్టు సీఐ తెలిపారు.





బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ నరసింహ కిశోర్



ముంచుకొస్తోంది : కోనసీమ జిల్లా ఓడలరేవులో భారీగా కోతకు గురైన సముద్రతీరం

ముక్కలు..చెక్కలు : ఉప్పాడ వద్ద రోడ్డు కోత

కల్లోల..కడలి!

ముప్పు ముంచుకొస్తోంది.. సముద్రతీరం భారీగా కోతకు గురవుతోంది. అలజడి రేపు తోంది..అటు కాకినాడ.. ఇటు కోనసీమ జిల్లాల్లో వేలాది ఎకరాల విలువైన భూములు సముద్రగర్భంలో కలిసిపోతున్నాయి. రహదారులు, సరుగుడు తోటలు, మడ అడవులు కళ్లెదుటే కడలిలో కలిసిపోతూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. సముద్ర తీరం వెంబడి అక్రమంగా ఇసుక తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

(కాకినాడ/ అమలాపురం, ఆంధ్రజ్యోతి)

ఏళ్ల తరబడి ఉప్పాడను వేధిస్తోన్న సముద్రపు కోతకు శాశ్వత పరిష్కారం సాధించే దిశగా ప్రభుత్వం అడు గులు ముమ్మరం చేసింది. ఐదేళ్లుగా కోత తీవ్రతతో నష్టం పెరిగినా అప్పటి వైసీపీ సర్కారు పట్టించుకోలేదు. ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉప్పా డను సముద్రపు కోత నుంచి కాపాడేందుకు వడివడిగా అడుగులు పడుతు న్నాయి. ఇటీవల కలెక్టర్ల సదస్సులో సముద్రపు కోతపై జరిగిన చర్చలో కోత నివారణకు అవసరమైన నిధులను కేంద్రం నుంచి రాబట్టేలా పర్యవేక్షిం చాలని కలెక్టర్ షాన్ మోహన్‌ను సీఎం ఆదేశించారు. దీంతో ఇటీవల కలెక్టర్ కేంద్రానికి లేఖ రాశారు. రూ.320 కోట్లతో 12 కిలోమీటర్ల మేర కోత నివారణకు ప్రణా ళిక సిద్ధం చేశామని వివరించారు. సీఎం ఆదే శాలతో ఈ ప్రతిపా దనపై జాతీయ విపత్తుల నిర్వహణ సం స్థతో సంప్రదింపులు ఆరంభించింది. నష్ట నివారణ నిధుల విడుదలకు దాదాపు సమ్మతించింది.ఈ తరహా ప్రతిపాదనలు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చినట్టు వివరించింది. ఉ ప్పాడ కోత తీవ్రత దృష్ట్యా త్వరలో నిధులు విడుదలకు మార్గం సుగమం అ వుతుందని అధికారులు భావిస్తున్నారు.

కోతకు అడ్డుకట్ట ఇలా

డిప్యూటీ సీఎం పవన్ జోక్యంతో కోతను అధ్యయనం చేయడానికి నేషనల్ కోస్టల్ రీసెర్చ్ సెంటర్ (ఎన్‌సీఆర్‌సీ) శాస్త్ర వేత్తలు వచ్చి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఉప్పాడ వద్ద దక్షిణం, ఉత్తర దిశల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలో డ్రాఫ్ట్ రూపొందించారు. ప్రధానంగా ఉప్పాడ వద్ద సముద్రం అలల తీవ్రత చాలా అధికంగా ఉన్నట్టు తేల్చారు.దానిని తగ్గించ గలిగితే కోత బాగా నెమ్మదిస్తుందని అంచనా వేశారు. ఉప్పాడ వద్ద తీరం నుంచి 170 మీటర్ల లోపు సముద్రంలో అత్యంత బలంగా కాంక్రీట్‌తో నిలువునా గోడ నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి టెట్రా పాడ్‌లు కలపనున్నారు.టెట్రాపాడ్‌లు మూడు కాళ్ల ఆకారంలో కాంక్రీట్ దిమ్మల్లా చాలా బలంగా ఉంటాయి.వీటిని కాంక్రీట్ గోడపై అమర్చుతారు. ఆపైన మళ్లీ భారీ రాళ్లు పేర్చుతారు. దీనివల్ల ఉప్పాడ వైపు అలల తీవ్రత దాదాపుగా తగ్గి కోత నెమ్మది స్తుంది. ఉప్పాడకు దక్షిణం వైపు కాకినాడ నుంచి వచ్చే దారిలో మలుపు వద్ద సముద్రం పూర్తిగా ముందుకు వచ్చేసింది.ఈ నేపథ్యంలో ఇక్కడ కొత్త బీచ్ సృష్టించాలని ప్రతిపాదించారు. శాస్త్రవేత్తలు పరిష్కారం కనుగొన్నారు. ఉప్పాడకు సమీపంలో కాకినాడ డీప్‌వాటర్ పోర్టు ఉంది. నేరుగా భారీ నౌకలు ఈ పోర్టుకు వస్తాయి.నౌకలు వచ్చే మార్గంలో ఏటా ఇసుక డ్రెడ్జింగ్ చేసి నౌకా మార్గానికి ఇబ్బంది లేకుండా చేస్తారు. డ్రెడ్జింగ్ చేసిన సమయంలో వచ్చే ఇసుకను ఉప్పాడ దక్షిణం వైపు పోసి కొత్త బీచ్ సృష్టించాలని తేల్చారు. ఏడాదికి 50 లక్షల క్యూబిక్ మీటర్ల చొప్పున, రెండేళ్లకు కోటి క్యూబిక్ మీటర్ల ఇసుకను తెచ్చి ఇక్కడ డంప్ చేయాలని నిర్ణయించారు.ఇలా 12 కిలోమీటర్ల మేర కోత నివారణ చర్యలు చేపట్టడానికి రూ.320 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

- కడలి కోపాగ్నికి కరుగుతున్న తీరం
- ఉప్పాడలో కోత నివారణకు కసరత్తు
- సీఎం ఆదేశాలతో కేంద్రానికి కలెక్టర్ లేఖ
- రూ.320 కోట్ల నిధులు కోరిన వైనం
- కేంద్రం నుంచి సానుకూల స్పందన
- శాస్త్రవేత్తలతో ప్రత్యేక అధ్యయనం
- కోనసీమలో మునుగుతున్న ఊళ్లు

20 ఏళ్లుగా ముందుకు..

కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద సముద్రం 20 ఏళ్లుగా భారీగా ముందుకు వచ్చేసింది. తుఫాన్లు, అల్పపీడనం సమయాల్లో తీరం అల్లకల్లోలంగా మారుతోంది. కోత వల్ల ఏకంగా 1,360 ఎకరాలు, రెండు ఆలయాలు, 150 వరకు ఇళ్లు సముద్ర గర్భంలో కలిసిపోయాయి.అధికారంలోకి వస్తే కోత నివారణకు శాశ్వత చర్యలు చేపడతామని ప్రస్తుత ప్రభుత్వం హామీ ఇచ్చింది.దీనికి తగ్గట్లుగా అడుగులు వేస్తుంది.

కోనసీమకూ.. గుండెకోత

కోనసీమలో సముద్రతీరం తీవ్రంగా కోతకు గురవుతోంది. వందల ఎకరాల భూములు కడలిలో కలిసిపోతున్నాయి. కోనసీమ జిల్లా 8 మండలాల పరిధిలో 48 కి.మీ. మేర తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఒక వైపు ఇసుక మాఫియా ప్రతినిధులు తీరాన్ని తవ్వేస్తుంటే మరో వైపు సముద్రం ముందుకు దూసుకొస్తూ ఊళ్లను ముంచెత్తుతోంది. భైరవపాలెంలోని సముద్రతీర ప్రాంతం నుంచి బ్రహ్మసమేధ్యం, చిర్రయానాం, ఎస్.యానాం, వాసాలతిప్ప, కొమరగిరిపట్నం,ఓడలరేవు, కేశనపల్లి, కరవాక, చింతలమోరి, అంతర్వేది తీరం వరకు సముద్రం భారీగా కోతకు గురవుతోంది. భవిష్యత్‌లో ఆందోళనకరమైన పరిణామాలకు కారణంగా నిపుణులు భావిస్తున్నారు. ఓడలరేవు తీరప్రాంతంలో వేలాది కోట్ల విలువైన చమురు సంపదను తరలించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఓఎన్జీసీ ప్లాంటుకు సంబంధించి భారీ నిర్మాణాలకు చేరువగా సము ద్రం ముందుకొచ్చింది. ఇటీవల తీరం అల్లకల్లోలం కావడంతో గతంలో ఓ కాంట్రాక్టు సంస్థ నిర్మించిన రక్షణ గోడ ఇప్పుడు ఛిద్రమై ప్లాంటు గోడ కూడా కోతకు గురయ్యే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. దీంతో ఓఎన్జీసీ అధికారులు ప్రత్యేక కార్యాచరణకు రంగం సిద్ధం చేస్తున్నారు. రూ.110 కోట్ల అంచనా వ్యయంతో సముద్రం వెంబడి పటిష్టమైన, అత్యాధునికమైన టెక్నాలజీతో కూడిన గోడను నిర్మించుకునేందుకు త్వరలోనే ఆ సంస్థ అధికారులు టెండర్లు పిలుస్తారని ఇక్కడ ప్రచారం జరుగుతోంది. కాగా ఓడలరేవు సముద్ర బీచ్ రిసార్ట్స్‌కు కూడా రాగల రోజుల్లో ముప్పు పొంచి ఉందని భావిస్తున్నారు.

పీజీఆర్ఎస్‌కు 193 అర్జీలు




జేసీకి సమస్యను విన్నవిస్తున్న యువతి

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రీ ఓపెన్ అయిన అర్జీల విషయంలో మరింత జవాబుదారీతనం కలిగి ఉండాలని జేసీ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మా ట్లాడారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.జిల్లాలో 964 అర్జీలు రీ ఓపెన్ కాగా ఇంకా 69 పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. రీ ఓపెన చేసిన ప్రతి అర్జీదారుడిని వ్యక్తిగతంగా కలిసి పరిష్కారం వివరాలు తెలియచేయాలన్నారు. అనంతరం 199 అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.కార్యక్రమంలో డీఆర్వో టి.సీతా రామమూర్తి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంఆర్ఆర్.ప్రేమ్‌కుమార్,డీఎల్‌డీవోలు పి.వీణాదేవి, ఏ.స్వీవారెడ్డి, డీపీవో శాంతమణి పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 46 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఎస్పీ నరసింహ కిశోర్ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి పలు సమస్యలపై వెంటనే ఫోన్ ద్వారా ఆయా పోలీస్ స్టేషన్ల బాధ్యులకు సూచనలు చేశారు. చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల నుంచి 46 అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం.మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు,ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

తూర్పున.. హై బీపీ!



ఎన్‌సీడీ సర్వేలో రోగాలు

- జిల్లాలో బీపీ కేసులు 88784
- డయాబెటిస్ కేసులు 57790
- రాష్ట్రంలో నాలుగో స్థానం
- గుండె వ్యాధిగ్రస్తులు అధికమే
- ప్రబలుతున్న అంటువ్యాధులు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో ఓ అడుగు ముందుకు వేసింది. ప్రజలు ఎందుకు రోగాల బారిన పడుతున్నారు. ఎవరు ఏ కారణాల వల్ల ఇబ్బందులు పడుతున్నారనే హేతువును తేల్చింది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న వ్యాధుల స్క్రీనింగ్‌లో భాగంగా జిల్లాలో కూడా గతేడాది నుంచి సర్వే చేస్తున్నారు. జిల్లాలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్) 2,3 సర్వే జరిగింది. అందులో అనేక వ్యాధులు బయటపడ్డాయి. ఎక్కువ మంది గుండె, కిడ్నీ, శ్వాస సంబంధిత వ్యాధులు, డయాబెటీస్, క్యాన్సర్, బీపీ వంటి సమస్యలతో అధికంగా ఇబ్బంది పడుతున్నట్టు తేలింది. సర్వేలో సుమారు 10 రకాల వ్యాధుల గురించి ఆరా తీశారు. 18 ఏళ్ల వయసు తర్వాత మహిళలు ఎక్కువ మంది హైపర్ టెన్షన్‌కు గురవుతున్నట్టు తెలిసింది. డయాబెటీస్ మగవారిలో ఎక్కువగా కనిపిస్తోంది. వర్షాకాలంలో వ్యాపించే చికున్ గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు జిల్లాలో అధికంగా ఉన్నట్టు చెబుతున్నారు. జిల్లాలో ఎన్‌సీడీ -2,3 సర్వేల్లో తేలిన అంశాల వివరాలిలా ఉన్నాయి. 88,784 మందికి హైపర్ టెన్షన్ ఉంది. డయాబెటీస్ (చక్కెర వ్యాధి)తో 57,790 మంది బాధపడుతున్నారు. రాష్ట్రంలో డయాబెటీస్ విషయంలో జిల్లా 4వ స్థానంలో ఉంది. హైపర్ టెన్షన్, డయాబెటీస్ ఉన్నవారి సంఖ్య 1,07,482గా ఉంది. ఇక మాయమైపోయిందనుకున్న పొంగు, ఆట్లమ్మ (చికున్‌ఫాక్స్) వంటి అంటువ్యాధులు ఇటీవల ఎక్కువగా కనిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలతో పాటు, ఉమ్మడి జిల్లాలో కూడా కేసులు నమోదు కావడం గమనార్హం. సర్వేలో తేలిన వ్యాధులకు చాలా మంది ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా చికిత్స పొందున్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో గుండె వ్యాధులకు సంబంధించి 8,891 మంది చికిత్స పొందారు.క్యాన్సర్‌కు సంబంధించి 5,106 మంది చికిత్స పొందారు. లివర్ సంబంధిత వ్యాధుల విషయంలో 1,084మంది చికిత్స పొందారు. ధీర్ఘకాలిక, శ్వాసకోశ వ్యాధులకు 1015 మంది చికిత్స తీసుకున్నారు. న్యూరాజికల్ ఇష్యూస్‌కు సంబంధించి 4,027 మంది చికిత్స పొందారు.క్రానిక్ కిడ్నీ వ్యాధులకు సంబంధించిన 4993 మంది చికిత్స పొందారు. దీర్ఘకాలిక రోగాలకు ఆహారపు అలవాట్లు, ప్రజల జీవన విధానంలో మార్పు వంటి కారణాలే ఎక్కు వగా కనిపిస్తున్నాయి.

సెమీ మెకనైజ్డ్ బోట్లతో ఇసుక తీత

త్వరలో 10 ర్యాంపుల్లో అమలు - కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి) : త్వరలో 10 గోదావరి ఇసుక ర్యాంపుల్లో సెమీ మెకనైజ్డ్ బోట్లతో ఇసుక తవ్వకాలు జరపనున్నామని..దీని ద్వారా 57,82,950 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ మీటింగ్‌లో మాట్లాడారు. సెమీ మెకనైజ్డ్ ర్యాంపుల్లో కాటవరం , సింగవరం, కుమారదేవం, తాడిపూడి, పెండ్యాల ర్యాంపులను ఇతర జిల్లాలైన పశ్చిమ గోదావరి, కాకినాడ, విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు జిల్లాలకు కేటాయించినట్టు చెప్పారు.వీటిని ఆయా జిల్లాలో డీఎల్ఎస్‌సీ పర్యవేక్షణ ఉండేటట్టు నిర్ణయించారు. సెమీ మెకనైజ్డ్ ర్యాంపులైన ప్రక్కిలంక, చిడిపి, అరికిరేవుల, మునికూడలి, పురుషోత్తపల్లి నుంచి జిల్లా అవసరాలకు ఇసుకను వినియోగించవచ్చన్నారు. రానున్న వానాకాలం దృష్టిలో పెట్టుకుని 18 లక్షల మె ట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ యార్డుల్లో అందు బాటులోకి తేనున్నట్టు చెప్పారు.దీనిని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు వినియోగించుకోవచ్చన్నారు. జిల్లా మైన్స్ ఏడీ డి. ఫణి భూషణ్‌రెడ్డి మాట్లాడుతూ 2024- 25 ఆర్థిక సంవత్సరానికి రూ.380.3 కోట్ల సీనరేజీ వసూలు లక్ష్యంకాగా రూ.390 కోట్లు వసూలు చేసి 102.55 శాతం సాధించినట్టు చెప్పారు. సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, అదనపు ఎస్పీ మురళీకృష్ణ,ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బీవీ గిరి, జిల్లా భూగర్భజల అధికారి వై.శ్రీనివాస్, ఆర్టీవో సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్‌ఎస్‌గా పద్మ



కొవ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తూర్పు గోదావరి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిగా డా.ఎం.పద్మ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్‌గా పనిచేసిన డా.ఎన్.పద్మశ్రీరాణి పదోన్నతిపై డీసీహెచ్‌ఎస్‌గా విజయనగరం వెళ్లారు.ఆమె స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నుంచి పద్మ పదోన్నతిపై డీసీహెచ్‌ఎస్‌గా సోమవారం కొవ్వూరులో బాధ్యతలు స్వీకరించారు.

డెలివరీ బాయ్స్‌కి ఈ శ్రమ్ గుర్తింపు కార్డులు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): డెలివరీ రంగంలో పని చేసే ఉద్యోగులు/కార్మికులు ఉచితంగా పేరు నమోదు చేసుకొని కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసే గుర్తింపు కార్డు పొందవచ్చని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. అమెజాన్, జొమాటో, స్విగ్గీ, ఊబర్, ర్యాపిడో, ఓలా, బిగ్ బాస్కెట్, ఫ్లిప్‌కార్ట్, బ్లింకిట్ వంటి సంస్థల్లో, రైడ్ షేరింగ్, కొరియర్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో పని చేసే వాళ్లు ఈ గుర్తింపు కార్డులు పొందడానికి అర్హులన్నారు. https://register.eshram.gov.in/#/user/platform-worker వెబ్‌సైటులో స్వయంగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.



ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు.. ప్రశ్నిస్తున్న యువకుడు

సునీల్‌ది ఆత్మహత్య కాదు.. హత్య?

రాపాకలో మృతుడి బంధువులు, స్నేహితులు ఆందోళన

సీతానగరం,ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం మండలం రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామనగర్ రాజుగారి గార్డెన్స్ వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంబులెన్స్‌లో ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్న సునీల్ మృతదేహం ఉంచుకుని ఆందోళనకు దిగారు. మృతుడిది హత్య అని బంధువులు, స్నేహితులు సోమవారం రోడ్డెక్కారు. ఫంక్షన్‌హాల్ యజమాని అడ్డాల హరికృష్ణ రాజు, సునీల్‌తో ఉన్న మహిళ కలసి హత్యచేసినట్టు అనుమానంగా ఉందన్నారు. వారిని అదుపులోకి తీసుకుని హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారికి అడ్డంగా నిలబడి ధర్నా చేసే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. మృతదేహంతో ఆందోళనకు ప్రయత్నించడంతో 17 మంది అదుపులోకి తీసుకుని పోలీస్ వేన్ ఎక్కించి కోరుకొండ తరలించే ప్రయత్నం చేశారు. తరువాత అక్కడున్న వారిని చెదరగొట్టి అంబులెన్స్‌లో ఉన్న మృతదేహాన్ని బంధువులకు అప్పగించి పంపించారు. దీనిపై సీఐ బాలశౌరిని వివరణ కోరగా మృతుడు సునీల్‌కు వరుసకు మరదలైన మహిళ హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం ప్రైవేట్ బస్‌లో సీతానగరం చేరుకుని సునీల్‌ని కలిసిందన్నారు. తనతో పాటు ఉండాలని అడిగినా కాదనడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఇది హత్యగా అనుమానం వ్యక్తం చేస్తున్నందున అన్ని కోణాల్లోను దర్యాప్తు చేస్తామన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే వెంకటరాజు

విశ్వగురువు మోదీ : ఎంపీ

నల్లజర్ల,ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న విశ్వగురువు ప్రధాని మోదీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు,రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలిసి సోమవారం ప్రకాశరావుపాలెం నుంచి తెలికిచర్ల, చోడవరం, ఆవపాడు గ్రామాలను అనుసంధానం చేస్తూ 8.65 కోట్లతో బీటీ రోడ్లను నిర్మించేందుకు శంకుస్థాపనలు చేశారు. ఎస్సీ కాల నీలో రూ.69 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో 84 పంచాయతీలు అభివృద్ధి చేయాలన్నారు.కార్యక్రమంలో ఆర్‌డీవో రాణి సుస్మిత, జనసేన ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు,బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర,తాతిన సత్యనారాయణ,వల్లూరి సత్తిపండు, పసుమర్తి రతీష్ పాల్గొన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

యువత ఉన్నత లక్ష్యాలతో దేశాభివృద్ధి సాధ్యం



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నన్నయ వీసీ తదితరులు

విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మనల్ని చూసి గర్వపడడం, చదువుకున్న విద్యాసంస్థకు ముఖ్యఅతిథులుగా రావడం, మన సంతకాలు ఆటోగ్రాఫ్‌లుగా మారడం వంటి మూడు విషయాలను యువత లక్ష్యాలుగా నిర్దేశించుకోవాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఇటువంటి లక్ష్యాలతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం జాతి నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి యువత మొబైల్‌ఫోన్‌లతో బిజీగా ఉన్నారని రీల్స్‌షాట్స్ చూస్తూ కాలయాపన చేస్తున్నారని వాపోయారు. మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని, మద్యం నాన్న రక్తం, ధూమపానం అమ్మ ఊపిరి తాగుతున్నాం అని గుర్తు చేసుకోవాలన్నారు. మన స్నేహితులు మంచి వారై ఉండాలని చెప్పారు. తద్వారా మనం ఉన్నతశిఖరాలకు చేరుకుంటామన్నారు. మహనీయుల చరిత్రను చదువుకోవాలని చెప్పారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ యువత ఒక దేశ బలం, పురోగతికి మూలస్థంభాలుగా ఉంటారన్నారు. సమాజంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకురావడంలో యువత గణనీయమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. బలమైన నైపుణ్యంగల యువత భారత దేశ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికార్లు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వారి పాత్రను వివరించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి కూటమి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ముగ్గురికి రూ.45,644 విలువైన చెక్కులను సోమవారం స్థానిక నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో అందించారు. మండలంలోని పశివేదల గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన కాకరపర్తి రామలక్ష్మి, కాకరపర్తి వెంకటమణికంఠ, కాకరపర్తి చిన వెంకట్రావులకు చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెనుమాక జయరాజు, చౌటిపల్లి శివ, ఉప్పులూరి చిరంజీవి పాల్గొన్నారు.

ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా

రేపు శాంతి ర్యాలీ

కొవ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గత నెల 24న అనుమానాస్పదంగా మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న శాంతి ర్యాలీ చేపడుతున్నట్టు పాస్టర్ రమేష్‌బాబు తెలిపారు. సోమవారం క్రిస్టియన్‌పేట ఇమ్మానియేలు ప్రార్థన మందిరంలో క్రైస్తవ సంఘాల నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటలకు మెరకవీధి అంబేద్కర్ విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టనున్నామన్నారు. ఇది ప్రభుత్వానికి వ్యతిరేకమైన కార్యక్రమం కాదని, కేవలం ప్రవీణ్ పగడాల మృతికి నివాళులర్పిస్తున్నామన్నారు. ఇటీవల క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, క్రైస్తవుల ఐక్యతను, సహనాన్ని తెలియజేస్తూ శాంతి ర్యాలీ చేపడుతున్నామన్నారు. ఆయన కుటుంబానికి సత్వర న్యాయం చేయాలన్నారు. సమావేశంలో బి.షాలెం పీటర్, ఎస్.జాన్ అముస్టర్, ఎం.బుజ్జిబాబు, ఎల్.బుజ్జిబాబు, బిషప్ కె.జోసఫ్, గోడి సామ్యూల్, ఎస్.అడ్వర్డ్, పాల్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- అన్నదేవరపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్వర్ణలత
- ప్రపంచ ఆరోగ్య దినోత్సవం
- పలుచోట్ల అవగాహన ర్యాలీలు



అన్నదేవరపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాళ్లపూడి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అన్నదేవరపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.స్వర్ణలత ఆధ్వర్యంలో ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశాజనక భవిష్యత్తు అనే నినాదంతో అన్నదేవరపేట జడ్పీ హైస్కూల్ నుంచి మెయిన్‌రోడ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిని స్వర్ణలత మాట్లాడుతూ తల్లులు, శిశువుల ఆరోగ్యంగా ఉండడం వల్ల ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రసవానికి ముందు, ప్రసవ అనంతరం ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. శిశువుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు, టీకాలను సక్రమంగా వేయించాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆసుపత్రిలోని వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మల్లికార్జునరావు, పీహెచ్ఎన్ అమరావతి, ఎస్కే బాషా, సీహెచ్ పద్మ పాల్గొన్నారు.



పెరవలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెరవలి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పెరవలి, కానూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి ప్రజలుకు అవగాహన కల్పించారు. ఉదయం నడక, వ్యాయామం, యోగా, సైక్లింగ్ వంటి కార్యక్రమాల ద్వారా శరీర ఆరోగ్యం పెరుగుతుందన్నారు. పెరవలిలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ హేమరాజు, సిబ్బంది ఈశ్వరాణి పాల్గొన్నారు. కానూరులో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ పి. తేజశ్రీ, వైద్య సిబ్బంది జయమణి, సత్రేంద్రకుమార్, కేవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. తల్లులు నవజాతి శిశువుల ఆరోగ్యం, శిశు మరణాల గురించి వివరించారు. ఆడబిడ్డకు 21 వయస్సు, మగబిడ్డకు 25 వివాహ వయస్సుగా ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కేడీవీ కుమారి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 14 ఫిర్యాదులు

కొవ్వూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): డివిజనల్ పీజీఆర్ఎస్‌లో 14 ఫిర్యాదులు స్వీకరించినట్టు ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజీ తెలిపారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 14 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జవహర్ బాజీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులను ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు పంపించి సత్వరం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జనసేన నాయకులతో మంత్రి దుర్గేష్ సమావేశం



జనసేన నాయకులతో సమావేశమైన మంత్రి దుర్గేష్

కొవ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గ జనసేన నాయకులతో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సమావేశమయ్యారు. సోమవారం మండలంలోని కాపవరంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన మంత్రి దుర్గేష్ అనంతరం పంగిడిలోని ఉప్పులూరి నానాజీ ఇంటిలో జనసైనికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను జనసేన నాయకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జనసేన సుంకర సత్తిబాబు, గంగుమళ్ల స్వామి, మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, మజ్జి శేఖర్, పోలిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఖండవల్లి విద్యుత్‌లైన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 8వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ నారాయణ అప్పారావు సోమవారం తెలిపారు. అలాగే పిట్లవేమవరంలో ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

ఎస్‌బీఐ బీమా పథకాలతో ఖాతాదారులకు భరోసా



ఖాతాదారులకు బీమా సొమ్మును అందజేస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఖాతాదారులకు తక్కువ ప్రీమియంతో ఎక్కువ నష్ట పరిహారం పొందేలా బీమా పథకాలు అమలుచేస్తున్నామని ప్రక్కిలంక బ్రాంచ్ మేనేజర్ బి.వెంకటయ్య తెలిపారు. పీఏఐ, పీఎంజేజేవై, పీఎంఎస్‌బీవై పేర్లతో ఇన్సూరెన్సులను ఎస్‌బీఐ అందజేస్తోందన్నారు. పోచవరం గ్రామానికి చెందిన రైతు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబానికి రూ.2 లక్షలు బీమా సొమ్మును సోమవారం అందజేశామన్నారు. సంవత్సరానికి రూ.2 వేలు చెల్లిస్తే యాక్సిడెంటు పాలసీగా రూ.40 లక్షలు, రూ.424 చెల్లిస్తే సహజ మరణానికి రూ.2 లక్షలు, రూ.25 చెల్లిస్తే యాక్సిడెంటు పాలసీ రూ.2 లక్షలు బీమాను అందజేస్తున్నామన్నారు. ఖాతాదారుల కుటుంబ ఆర్థిక ప్రయోజనం, వారికి భరోసా కలిగించే ఇన్సూరెన్సు పథకాలను వినియోగించుకోవాలన్నారు.

రేపు కానూరులో నేత్ర వైద్య శిబిరం

పెరవలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కానూరు జడ్పీ హైస్కూల్ పక్కనున్న జూనియర్ కళాశాలలో ఈ నెల 9న నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. నిడదవోలుకు చెందిన శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ కంటి ఆసుపత్రి సహకారంతో చేపట్టనున్న ఈ శిబిరాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు.



రైసుమిల్లును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఆంధ్ర సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు, ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో రాణి సుస్మిత

గోవర్ధనగిరిమెట్టలో ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రారంభం

కొవ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాపవరం గోవర్ధనగిరిమెట్టలో నిర్మించిన జొన్నలగడ్డ ఆగ్రో ప్రొడక్ రైసుమిల్లును సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, ఆంధ్రసుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుత రామయ్య (అచ్చిబాబు), ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత పాల్గొని రైసుమిల్లులోని వివిధ విభాగాలను ప్రారంభించారు. ముఖ్య అతిథులకు ద్విసభ్య కమిటీ సభ్యులు, రైసుమిల్లు మేనేజింగ్ పార్టనర్ జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధారాణి దంపతులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మేనేజింగ్ పార్టనర్స్ పొట్రు శ్రీనివాసరావు, వి.పవన్‌రామ్, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, అర్బన్‌బ్యాంకు ఛైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, యనమదల సుబ్రహ్మణ్యం, వట్టికూటి వెంకటేశ్వరరావు, కాకర్ల బ్రహ్మాజీ, కొఠారు వెంకట్రావు, నామాన పరమేష్, బొడ్డు రాజు, నియోజకవర్గంలోని నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కడియాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఆలయం వద్ద పూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్తులు

దేవరపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో దేవరచెరువు వద్ద ఉన్న కడియాలమ్మ అమ్మవారి పురాతన ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా సోమవారం విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా ప్రారంభించారు. తెల్లవారు జాము నుంచే వేద పండితులు పెడసనగంటి సాయిబాబు, పెడసనగంటి శశికాంత్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ఆలయం వద్ద విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచ నం, రక్షా కంకణం, వాస్తు పూజ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, గోపూజ, సర్వ దేవతల హోమాలు, పూర్ణాహుతి, గోదిష్టి నిర్వహించారు. అమ్మ వారి విగ్రహాన్ని దాత గన్నమని శ్రీనివాస్ ఇవ్వ గా, విగ్రహ ప్రతిష్ఠను పసుపులేటి శివనాగ ప్రసాద్ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర రాజు, గన్నమని వెంకటేశ్వరరావు, గన్నమని శ్రీనివాస్, గన్నమని పెద్దబ్బులు, పసుపులేటి శివనాగప్రసాద్ దంపతులు పూజలు, హోమాలు నిర్వహించారు.

మహిళలకు చీరల పంపిణీ



సౌందర్యలహరి పారాయణం చేసిన మహిళలకు చీరలు పంపిణీ చేసిన ధనుంజయుడు

దేవరపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి జగద్గురువు ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో సౌందర్యలహరి పారాయణ చేసిన 45 మంది మహిళలకు కరుటూరి ఫంక్షన్ హాల్స్ అధినేత కరుటూరి ధనుంజయుడు సోమవారం చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని, ఆదిశంకరాచార్యులు సనా తన ధర్మాన్ని ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. అనంతరం మహిళా కమిటీ సభ్యులు ఆయన్ను సత్కరించి ఆదిశంకరాచార్యులు చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ హరినాథ్, తోట సత్యనారాయణ, మహిళా సభ్యులు పాల్గొన్నారు.



గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో రాణిసుస్మిత

ఎంఎల్ఎస్ గొడౌన్ తనిఖీ

గోపాలపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎంఎల్ఎస్ పాయింట్ నిర్వహణను అప్రమత్తంగా నిర్వహించాలని కొవ్వూరు ఆర్డీవో కే. రాణిసుస్మిత అన్నారు. మండలంలోని ఏఎంసీ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎంఎల్ఎస్ గొడౌన్ పాయింట్‌ను సోమవారం ఆమె తనిఖీ చేశారు. గొడౌన్ నిర్వాహకులకు ఆమె పలు సూచనలు చేశారు. స్టాకు వివరాల రికార్డులను ఆమె పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ అజయ్‌బాబు, సివిల్ సప్లయి డీటీ దివాకర్ తదితరులు ఉన్నారు.



పామాయిల్ చెట్లను తొలగిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

చెట్ల తొలగింపు

దేవరపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లకు పామాయిల్ చెట్లు అడ్డు రాకుండా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని దేవరపల్లి విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్ వెంకట్రావు తెలిపారు. రామన్నపాలెం గ్రామానికి చెందిన కూచిపూడి బుల్లారావు విద్యుత్ లైన్ల సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని స్వచ్ఛందంగా 18 పామాయిల్ చెట్లను తొలగించారని ఏఈ తెలిపారు. విద్యుత్ లైన్లకు అంతరాయం కలగకుండా రైతులు పామాయిల్, కొబ్బరికొమ్మలను స్వచ్ఛందంగా నరికివేయాలన్నారు.

నేడు ఎమ్మెల్సీ వీర్రాజు విజయోత్సవ ర్యాలీ

గోకవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు రెండో సారి ఎమ్మెల్సీగా నియమితులైన సందర్భంగా 8న విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస రావు తెలిపారు. గోకవరంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7.30కు రామసేన సభ్యులు, బీజేపీ శ్రేణులు సీఎండీ లేఅవుట్‌కు చేరుకొని అక్కడ నుంచి ర్యాలీగా రాజమహేంద్రవరం చేరుకొంటుందన్నారు. అక్కడ సత్కరించనున్నట్టు చెప్పారు.



గౌరీపట్నం పీహెచ్‌సీ వైద్యుల అవగాహన ర్యాలీ

ఆరోగ్యమే మహాభాగ్యం

దేవరపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు జే.సతీశ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గౌరీపట్నం, చిన్నాయి గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీకృష్ణుడు, పద్మకుమారి, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ గోపాలపురం

నల్లజర్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి కేరాఫ్‌గా గోపాలపురం నియోజకవర్గం నిలువాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. సోమవారం ప్రకాశరావుపాలెంలో నాలుగు మండలాల ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశా రు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరిగేలా ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గత ప్రభుత్వం దోచుకోవడం తప్ప రహదారులను పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, వల్లూరి సత్తిపండు, పసుమర్తి రతీష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి మృతి



కొవ్వూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక రోడ్డు కం రైలు వంతెన పైనుంచి గోదావరి నదిలో దూకి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం...రాజమహేంద్రవరం విద్యుత్‌నగర్‌కు చెందిన సబ్బెళ్ళ శ్రీనివాస రెడ్డి(50) ప్రైవేటు కంపెనీలో వర్క్ ఫ్రం హోంగా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి సుజూకీ యాక్సిస్ బండిపై రోడ్డు కం రైలు బ్రిడ్జి పైకి వచ్చాడు. 103వ స్తంభం వద్ద బండిని పార్కు చేసి వంతెన పైనుంచి గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. అటుగా వెళుతున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ పి.విశ్వం సిబ్బందితో చేరుకున్నారు. జాలర్ల సాయంతో మృతదేహాన్ని నది నుంచి ఎరినమ్మఘాట్ వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాజమహేంద్రవరం విద్యుత్‌నగర్‌కు చెందిన సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇతనికి భార్య భువనేశ్వరి, కుమారుడు సాయి అమిత్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ సత్యనారాయణ కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

వడగళ్ల వాన

గోకవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సూర్యప్రతా పానికి అల్లాడిపోతున్న గోకవరం మండల ప్రజానీకానికి సోమవారం సాయంత్రం చల్లటి గాలులతో కురిసిన వడగళ్ల వాన కొంత ఊరటనిచ్చింది. సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై సుమారు రెండు గంటల పాటు ఓ మోస్తరు వర్షం పడింది. కాగా వడగళ్లతో వాన వల్ల మామిడితోట లకు నష్టం వాటిల్లితుందని రైతులు లబోదిబోమంటున్నారు. వరి పంటకూ నష్టం తప్పదని రైతాంగం వాపోయింది.